సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం | 22 | జూలై | 2025



అది పరువు హత్యేనా?
గండికోటలో సంచలనం సృష్టించిన బాలిక హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించినట్లు తెలిసింది. నిందితులను గుర్తించినట్లు సమాచారం.
-10లో



ఇలాగైతే ఎలా'గండి'!
శ్రావణ మాసోత్సవాల సందర్భంగా గండి ఆలయంలో యేటా వేసే జర్మన్ షెడ్డు ఈసారి సమస్యగా మారింది. దీనికి తోడు పారిశుద్ధ్య కార్మికుల సమస్య ఉంది.
-10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.400	రూ.520
రెండోరకం	రూ.200	రూ.380

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 400 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

వైభవం..పల్లకీ ఉత్సవం



పల్లకీలో ఊరేగుతున్న వీరభద్రస్వామి

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను రంగు రంగులపూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు. అనంతరం పల్లకీలో కొలువు దీర్చి ఆలయ మాఢవీధులలో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నియామకం



పి.దేవనాథరెడ్డి



ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి

రాయచోటి: వైఎస్‌ఆర్‌సీపీ నాయకులకు వివిధ హోదాల్లో పార్టీ కోసం పనిచేసేందుకు రాష్ట్ర స్థాయి పదవులను కేటాయించింది. వీరిలో అన్నమయ్య జిల్లా నుంచి రాయచోటికి చెందిన జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ పి.దేవనాథరెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిలకు రాష్ట్ర పార్టీ కార్యదర్శులుగా నియమించింది.ఈ మేరకు పార్టీ రాష్ట్ర కేంద్ర కార్యాలయం నుంచి పదవుల కేటాయింపు చేస్తూ ప్రకటనను విడుదల చేసింది. రాజంపేట పార్లమెంట్ పరిధిలో పార్టీ పరిశీలకులుగా పని చేస్తున్న వారితో సమన్వయం చేసుకొని పార్టీ పటిష్టతకు కృషి చేసేలా చర్యలు చేపట్టింది.

సమస్యలకు సత్వర పరిష్కారం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలకు సత్వరం పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ అన్నారు. ముఖ్యమంత్రి కార్యాయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్‌ఎల్‌ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్‌ఓ మధుసూదనరావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమానికి రూ. 850 కోట్లు




మాట్లాడుతున్న మంత్రి ఎన్‌ఎండీ.ఫరూఖ్

మదనపల్లె రూరల్:రాష్ట్రంలోని మైనారిటీల సంక్షేమానికి కూటమిప్రభుత్వం 850 కోట్లు ఖర్చు చేస్తోందని మైనారిటీ మంత్రి ఎన్ఎండీ.ఫరూఖ్ అన్నారు. సోమవారం మదనపల్లె మండలం కోళ్లబైలు-1 పంచాయతీలో, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అధ్యక్షతన జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి ఫరూఖ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో కూటమిప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...గత ప్రభుత్వం మైనారిటీల కోసం 420 కోట్లు ఖర్చుచేస్తే..కూటమిప్రభుత్వం 850 కోట్లు ఖర్చుచేస్తోందన్నారు. తల్లికి వందనం పథకం కింద కూటమి ప్రభుత్వం రూ.10వేల కోట్లు ఖర్చుచేసిందన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ..రాష్ట్ర ఆర్థికపరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు అమలుచేయడంలో కూటమిప్రభుత్వం వెనుకడుగు వేయలేదన్నారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, జునైద్ అక్బరీ, గంగారపునవీన్, ఆర్.జే. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హైవే.. ఇక హైస్పీడ్‌వే

- కడప-రేణిగుంట హైవేకు వన్యప్రాణి పచ్చజెండా!
- 122 కిలోమీటర్ల ఫోర్‌లైన్
- ఇక పనులే ప్రారంభం
- వన్యప్రాణుల సంచారం కోసం 11చోట్ల వంతెనలు



రాజంపేట: శేషాచలం అటవీ ప్రాంతంలోపచ్చటి ప్రకృతి ఒడిలో ఆహ్లాదకరమైన ప్రయాణం కల్పించే కడప-రేణిగుంట హైవేకు వైల్డ్‌లైఫ్ (వన్యప్రాణి సంరక్షణవిభాగం) పచ్చజెండా ఊపింది. రాజంపేట నియోజకవర్గం, సిద్దవటం మండలం భాకరాపేట వద్ద ఉన్న పెద్దపల్లి, రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట వద్ద టోల్‌ప్లాజా నిర్మితం చేయనున్నారు.

సోలాపూర్-చెన్నై జాతీయరహదారిలో..

సోలాపూర్-కర్నూలు-చెన్నై జాతీయరహదారి (716)లో ఆంధ్రప్రదేశ్‌లో 329 కిలోమీటర్ల మేర విస్తరించారు. ఇందులో కడప -రేణిగుంట వరకు 122 కిలోమీటర్ల దూరం నాలుగు వరుసలుగా విస్తరించేలా ప్రాజెక్టు మంజూరైంది. అటవీశాఖ , పర్యావరణ అనమతులు గత డిసెంబరులో వచ్చాయి. వైల్డ్‌లైఫ్(వన్యప్రాణి సంరక్షణ విభాగం) అనుమతులు ఇస్తూ కేంద్రం ఇటీవల నిర్ణయం తీసుకుంది. దీంతో త్వరలో పనులు ప్రారంభంకానున్నాయి.

రూ.3,232 కోట్లతో..

రూ.3,232 కోట్లతో చేపట్టనున్న కడప-రేణిగుంట హైవేను లక్ష్మీ ఇన్‌ఫ్రా సంస్థ దక్కించుకున్న సంగతి తెలిసిందే, ఇప్పటికే లక్ష్మీ ఇన్‌ఫ్రా సంస్థ నిర్మాణపనులకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసుకుంది. పనులు ప్రారంభించేలా ఎన్‌హెచ్ఏఐ అపాయింటెండ్ డేట్‌ను త్వరలో ఖరారు చేయనుంది. అప్పటి నుంచి రెండేళ్లలో హైవే పనులు పూర్తి చేయాల్సి ఉంది.

తక్కువ వ్యవధిలోనే తిరుపతి..

కడప-రేణిగుంట ఎన్‌హెచ్ ఏర్పడిన తర్వాత తక్కువ వ్యవధిలో తిరుపతికి చేరుకునే పరిస్థితులు ఆవిష్కృతమవుతాయి. ఫలితంగా మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల నుంచి పుణ్యక్షేత్రమైన తిరుపతి, చెన్నై నగరాలకు వెళ్లే వారికి కడప-రేణిగుంట రహదారి ఎన్‌హెచ్ చేయడం వల్ల త్వరితగతిన గమ్యానికి చేరుకునే వీలు కలుగుతుంది.

ఎంపీ మిథున్‌రెడ్డి కృషి

కడప-రేణిగుంట నేషనల్ హైవే త్వరితగతిన నిర్మతం అయ్యేందుకు వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథునరెడ్డి కృషి చేశారు. కేంద్రం తీసుకున్న ప్రయార్టీలో కడప-రేణిగుంట ఎన్‌హెచ్‌ను చేర్చేలా ప్రయత్నాలు చేశారు. ఫలితంగా భూసేకరణతోపాటు, మరో వైపు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. రెండేళ్ల లక్ష్యంగా ఎన్‌హెచ్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నదే అభిమతంగా ఎంపీ కృషి చేశారు.

82 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్..

కడప-రేణిగుంట నేషనల్ హైవేలో 82 కిలోమీటర్ల దూరం గ్రీన్‌ఫీల్డ్‌రోడ్‌గా పరిగణలోకి తీసుకున్నారు. కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల పరిధిలో 122 కిలోమీటర్ల హైవే కొనసాగుతుంది. కడప నుంచి భాకరాపేట వరకు ఇప్పుడున్న రెండువరసల దారిని నాలుగు వరసలుగా మార్చుతారు. భాకరాపేట నుంచి రైల్వేకోడూరు అవతల శెట్టిగుంట వరకు 82 కిలోమీటర్ల మేర కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నిర్మించనున్నారు. శెట్టిగుంట నుంచే రేణిగుంట సమీపంలో ప్రస్తుతం ఉన్న హైవేను ఫోర్‌లైన్‌గా మార్చనున్నారు. రేణిగుంట వద్ద బైపాస్ 3.5 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. ఈ హైవే ప్రాజెక్టు రెండు ప్యాకేజీలుగా విభించారు. కడప నుంచి చిన్నఓరంపాడు వరకు 64 కిలోమీటర్లు తొలి ప్యాకేజీగా, విభించారు. చిన్నఓరంపాడు నుంచి రేణిగుంట వరకు 58 కిలో మీటర్ల దూరాన్ని రెండో ప్యాకేజి కిందికి తీసుకొచ్చారు.

వన్యప్రాణులు సంచరించేలా..



గ్రీన్‌ఫీల్డ్ హైవే కొంత భాగం అటవీ ప్రాంతంలో వెళ్లాల్సి ఉంది. అందువల్ల ఒక టిన్నర మీటర్ ఎత్తులో హైవే నిర్మాణం చేపట్టనున్నారు. వన్యప్రాణాణులు సంచరించేందుకు వీలుగా ఈ హైవే 5.5 కిలోమీటర్ల మేరకు 11 చోట్ల వంతెనలు నిర్మించనున్నారు. దీని వల్ల వంతెనలపై నుంచి వాహనాలు రాకపోకలు వెళ్లేలా డిజైన్ చేశారు. వంతెనల కింద భాగంలో వన్యప్రాణులు రాకపోకలు కొనసాగించేందుకు సౌకర్యం కల్పించనున్నారు.

తగ్గనున్న ట్రాఫిక్..



ప్రస్తుత కడప-రేణిగుంట హైవేలో రోజురోజుకు ట్రాఫిక్ పెరుగుతోంది. ఈ మార్గం మీదుగా తిరుపతి, చెన్నై, ముంబై, హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం 17వేలకు పైగా వాహనాలు హైవేపై పరుగులు తీస్తున్నాయి. ఈ ట్రాఫిక్‌కు ప్రస్తుతం ఉన్న హైవే కెపాసిటీ సరిపోవడంలేదు. ఫలితంగా ట్రాఫిక్ స్తంభిస్తోంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.అంతేగాకుండా కడప-రేణిగుంట రోడ్డు ప్రయాణం మూడు నుంచి నాలుగు గంటలకుపైగా పడుతోంది. సకాలంలో గమ్యాలకు చేరలేని పరిస్థితి. నాలుగులైన్ల రోడ్డు నిర్మాణంతో ట్రాఫిక్ తగ్గుతుంది. సర్వీసు రోడ్డుగా మారనుండటంతో ప్రమాదాలు తగ్గుముఖం పడతాయి.

అక్రమాల గుట్టు.. తిరుమలేశుడికెరుక!

- మహానాడు సందర్భంగా విద్యాసంస్థల నుంచి లక్షల్లో వసూలు
- సస్పెండ్ చేయాలని అధిష్టానం నుంచి ఆదేశాలు
- తానే రాజీనామా చేస్తానన్న టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుడు

సాక్షి టాస్క్‌ఫోర్స్: తెలుగునాడు విద్యార్థి సంఘం(టీఎన్ఎస్ఎఫ్) పేరు చెప్పుకొని ఆ విద్యార్థి నాయకుడు ఎగిరెగిరి పడ్డాడు. కాంగ్రెస్ పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి వలస వచ్చిన ఆ ఛోటా నాయకుడి పేరు అనతి కాలంలోనే అందరి నోళ్లలో నానింది. ఇదే అదునుగా అనేక అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడుతూ అక్రమ వసూళ్లకు తెరలేపాడు. చివరికి సొంత పార్టీ నేతల విద్యా సంస్థల నుంచే డబ్బు వసూలు చేసేందుకు సాహసించి అడ్డంగా బుక్కయ్యాడు. దీంతో అతన్ని సస్పెండ్ చేయాలని పార్టీ అధిష్టానం సూచించినట్లు తెలుస్తోంది. అతని నిజస్వరూపం బయటపడటంతో జిల్లా పార్టీ నేతలు కూడా అతన్ని పిలిపించి మందలించగా తానే రాజీనామా చేస్తానని చెప్పినట్లు తెలుస్తోంది. ఈతతంగం జరిగి 20 రోజులైనా అతను రాజీనామా చేయలేదు. పార్టీ అతన్ని సస్పెండ్ చేయడమూ జరగలేదు. ఈ విషయం జిల్లా టీడీపీ లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

వివరాలిలా ఉన్నాయి....

జిల్లా కాంగ్రెస్ పార్టీలో ఎన్ఎస్‌యూఐలో పని చేసిన ఓ విద్యార్థి నాయకుడు 2024 ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీలో చేరాడు. చూసి రమ్మంటే కాల్చివచ్చే అతని దుడుకు స్వభావాన్ని గమనించిన కడప ఎమ్మెల్యే మాధవి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అతన్ని ప్రతిపక్ష పార్టీ నాయకులపై ఉసిగొల్పారు. అతను కూడా ఎమ్మెల్యేకు తాను తప్పా మరెవరూ విశ్వాసపాత్రుడు లేదన్న రీతిలో వ్యవహరించాడు. ఈ క్రమంలో మేయర్ సురేష్ బాబు ఇంటిపై చెత్త వేయించిన ఘటనలో... కార్పొరేషన్‌లో సర్వసభ్య సమావేశం జరిగిన ప్రతీసారి కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో నాయకులను వెంటేసుకొని హంగామా చేయడం ద్వారా అందరి దృష్టిలో పడ్డాడు. ఇంతలోనే కడపలో మహానాడు నిర్వహించాలని ఆ పార్టీ అధిష్టానం నిర్ణయించడంతో ఆ నాయ కుడు ఇదే అదునుగా భావించి అక్రమ వసూళ్లకు తెరలేపాడు. ప్రతి విద్యాసంస్థ నుంచి లక్ష నుంచి రూ.2లక్షల వరకూ వసూలు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. వెళ్లిన ప్రతిచోటా కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసులరెడ్డి పేరు చెప్పడంతో విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా భయపడి అడిగినంతా సమర్పించుకున్నట్లు తెలిసింది. పనిలో పనిగా నారాయణ విద్యాసంస్థల నుంచి కూడా వసూలు చేసేందుకు విఫలయత్నం చేసినట్లు సమాచారం. ఈ విషయం మంత్రి నారాయణకు తెలియడంతో జిల్లా పార్టీ నేతలపై ఆయన సీరియస్ అయినట్లు తెలిసింది. ఈ మేరకు అతన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని అధిష్టానంతో చెప్పించగా, జిల్లా పార్టీ నేతలు కూడా అతన్ని పిలిపించి తీవ్రంగా మందలించినట్లు తెలుస్తోంది. దీంతో చేసేదేమీ లేక తానే రాజీనామా చేస్తానని చెప్పి బయటపడిన ఆ విద్యార్థి నాయకుడు అప్పటి నుంచి ముఖం చాటేశాడు. దీనివెనుక ఏం జరిగిందనే వివరాలు బయటికి రాకుండా జిల్లా పార్టీ ముఖ్యనేత తొక్కిపెట్టినట్లు తెలిసింది.

ధైర్యంగా ఉండండి...
పార్టీ అండగా ఉంటుంది

మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డిని ఫోన్‌లో పరామర్శించిన మాజీ సీఎం వైఎస్ జగన్



మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డికి ఘనస్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సాక్షి, రాయచోటి: అధికార పార్టీ పెట్టే అక్రమ కేసులు, దౌర్జన్యాలకు భయపడవద్దని.. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఎప్పుడూ మీకు అండగా ఉంటుందని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారు. అందుకు సంబంధించి సోమవారం మధ్యాహ్నం మదనపల్లె పోలీసు స్టేషన్‌లో ఉన్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డిని మాజీ సీఎం వైఎస్ జగన్ ఫోన్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా కూటమి సర్కార్ ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందరం తోడుగా ఉంటామని పేర్కొన్నారు. ప్రతి దానికి చెల్లింపులుంటాయని, ధైర్యంగా ముందుకు సాగాలని వైఎస్ జగన్ సూచించారు. సంఘటనకు సంబంధించిన రమేష్‌కుమార్‌రెడ్డిని అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు.

రమేష్‌కుమార్ రెడ్డి విడుదల

అన్నమయ్య జిల్లా రాయచోటి మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి సోమవారం సాయంత్రం స్టేషన్ బెయిలుపై విడుదలయ్యారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు, మంత్రి రాంప్రసాద్‌రెడ్డిలపై చేసిన రాజకీయ విమర్శలను సాకుగా చూపి ఆదివారం రమేష్‌కుమార్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న విషయం పాఠకులకు విదితమే. లక్కిరెడ్డిపల్లె నుంచి వివిధ స్టేషన్లకు తిప్పుతూ మదనపల్లెకు తరలించిన విషయం కూడా తెలిసిందే. అయితే సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మదనపల్లెలో ఉన్న రమేష్‌కుమార్‌రెడ్డిని సాయంత్రం చిన్నమండెం పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి అక్కడ 41ఏ నోటీసు ఇచ్చి విడుదల చేశారు. మదనపల్లె పోలీసుస్టేషన్ వద్ద వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, మదనపల్లె పార్టీ ఇన్‌చార్జి నిసార్ అహ్మద్ తదితరులతో పాటు పలువురు న్యాయవాదులు కలిసి కేసు విషయమై చర్చించారు. అక్కడి నుంచి రమేష్ కుమార్‌రెడ్డి నేరుగా లక్కిరెడ్డిపల్లెకు చేరుకున్నారు.మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి స్టేషన్ బెయిలుపై విడుదలై లక్కిరెడ్డిపల్లికి చేరుకునేంతవరకు దారి పొడవునా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు, పెద్దఎత్తున స్వాగతం పలికారు. లక్కిరెడ్డిపల్లిలోని తన నివాసంలో రమేష్ కుమార్ రెడ్డికి గజమాలలు వేసి దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. లక్కిరెడ్డిపల్లి, రామాపురం, రాయచోటి, సంబేపల్లి, చిన్నమండెం, గాలివీడు మండలాలకు చెందినవారు రమేష్ కుమార్ రెడ్డిని కలిసి పలకరించడంతో పాటు సంఘీభావం వ్యక్తం చేశారు.

తాటాకు చప్పళ్లకు భయపడం: రమేష్ కుమార్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లి: నీ తాటాకు చప్పుళ్లకు, ఉడత ఊపులకు భయపడే ప్రసక్తేలేదని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆయన సోదరుడు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డిపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డప్పగారి రమేష్‌కుమార్ రెడ్డి ఫైర్ అయ్యారు. బెయిల్‌పై విడుదలైన అనంతరం సోమవారం లక్కిరెడ్డిపల్లెలోని తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సూపర్ సిక్స్ ఇవ్వలేదు కాబట్టే ప్రభుత్వంపై మాట్లాడామని, మీరు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చి ఉంటే తాము మాట్లాడే వాళ్లం కాదన్నారు, ప్రజల పక్షాన నిలదీస్తే నా గుడ్డలు చించుతా అన్నారు. ఏ మగాడైనా రెడీ...నేను సిద్ధంగా ఉన్నానంటూ సవాల్ విసిరారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీలో విమర్శలు చేస్తే ఒక వ్యక్తి మతిస్థిమితం లేకుండా ప్రవర్తించాడన్నారు. ఆయన ఏదన్నా చేస్తే భయపడి పారిపోయే వాళ్లు ఇక్కడ ఎవరూ లేరన్నారు. నా లైఫ్‌లో ఇలాంటి వాళ్లను వంద మందిని చూశానన్నారు. నోటికొచ్చినట్లు తల్లిదండ్రులను కూడా తిడుతున్నారు. మీరు వాడే పదాలు నాకూ వచ్చు.. మా తండ్రి గురించి విమర్శలు చేశారు. నాకు సంస్కారం ఉంది కాబట్టి వాళ్ల తండ్రి గురించి మాట్లాడను. చంద్రబాబు ఇలాంటి సంస్కారం మీరే నేర్పించారా? అంటూ వారిని ప్రశ్నించారు.

- మీ పదవులు, అధికారాలు ఎక్కువ రోజులు ఉండవనే విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. వచ్చేసారి మేం అధికారంలోకి వస్తాం. అప్పుడు వడ్డీతో సహా లెక్క కట్టి ఇస్తామని రమేష్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ప్రతినిత్యం జగనన్న గురించి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. మీపై కేసులుండవా అని అన్నారు.రాబోయే ఎన్నికల్లో కూటమికి రాష్ట్రంలో డిపాజిట్లు కూడా రావని, వైఎస్సార్‌సీపీ నూటికి నూరు శాతం గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాలాడి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య, తిమ్మిరెడ్డి, ఉమాపతి రెడ్డి, బీసీ నాయకులు విజయభాస్కర్, గాలివీడు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, వైస్ ఎంపీపీ యదుభూషణ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్ రెడ్డి, నూలివీడు ఉప సర్పంచ్ ఉమాపతిరెడ్డి, గున్నికుంట్ల సర్పంచ్ భూషణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో వర్షం

రాయచోటి: జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ దాటిపోతున్న సమయంలో కురిసిన వానల వల్ల ఎలాంటి లాభం లేదని రైతులు మదనపడుతున్నారు. అయితే అరకొరగా సాగైన వేరుశనగ కంది, టమాటా తదితర పంటలకు ఈ వానలు ఊపిరిపోశాయి. ఆదివారం రాత్రి కురిసిన వర్షాలకు వాతావరణం చల్లబడింది. వర్షపాతం వివరాలిలా ఉన్నాయి.

మండలం	కురిసిన వర్షం(మి.మీ)	మండలం	కురిసిన వర్షం(మి.మీ)
కలకడ	67.4	పెనగలూరు	25.4
రాజంపేట	65.2	రామాపురం	25.2
చిట్వేలి	63.8	నిమ్మనపల్లి	24.6
కురబలకోట	47	గుర్రంకొండ	22.6
సంబేపల్లి	12.4	వీరబల్లి	21
పీలేరు	66	నందలూరు	21.8
చిన్నమండెం	38	పెద్దమండెం	19.8
పుల్లంపేట	37.6	వాల్మీకిపురం	18.6
టి.సుండుపల్లి	32.4	గాలివీడు	18.2
రాయచోటి	32.4	లక్కిరెడ్డిపల్లె	15.2
కెవి పల్లి	32	ఓబులవారిపల్లి	14
కలికిరి	29	మదనపల్లి	13.4

ఉపకార వేతనాల కోసం దరఖాస్తుల ఆహ్వానం



రాయచోటి టౌన్: జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విభిన్న ప్రతిభావంతులైన (దివ్యాంగులు) విద్యార్థుల నుంచి ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సహాయ సంచాలకులు ఆర్‌వీ కృష్ణ కిశోర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ ప్రీ- మెట్రిక్ (9,10వ తరగతులు), పోస్ట్ మెట్రిక్ (ఇంటర్, అంత కన్నా ఎక్కువ చదివే వారు) విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

- వీరిలో ప్రీ మెట్రిక్ చదివే వారు ఆగస్టు 31లోగా, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులు అక్టోబర్ 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

విద్యార్థి ఆచూకీ లభ్యం

బి.కొత్తకోట : ఫోన్ మాట్లాడొద్దు అన్నందుకు తండ్రిపై అలిగి అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ సోమవారం లభ్యమైంది. స్థానిక బీసీ కాలనీకి చెందిన వెంకట్రాది కుమార్తె మేఘన (19) ఆదివారం అదృశ్యమైంది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ మొదలు పెట్టగా మేఘన తిరుపతిలోని పెద్దమ్మ ఇంటిలో ఉన్నట్టు గుర్తించి ఇక్కడికి తీసుకొచ్చారు. తహసీల్దార్ బావాజాన్ ఎదుట హాజరుపర్చి తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా తనకు పెళ్లి చేస్తారని అందుకే పెద్దమ్మ ఇంటికి వెళ్లిపోయి అక్కడే ఉండాలనుకొన్నట్టు మేఘన పోలీసులకు తెలిపింది.

అదుపు తప్పి వడ్ల లారీ బోల్తా



వండాడి గుట్ట సమీపంలో బోల్తాపడిన వడ్ల లారీ

చిన్నమండెం : చిన్నమండెం మండలం వండాడి క్రాస్ సమీపంలో వడ్ల లారీ అదుపు తప్పి బోల్తా పడినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు.. రాయచోటి నుంచి మదనపల్లెకు వడ్ల లారీ వెళ్తుండగా వండాడి గుట్ట వద్దకు రాగా అదుపు తప్పి పక్కకు ఒరిగి మామిడితోటలో బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్, క్లీనర్‌లు సురక్షితంగా బయటపడ్డారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మహిళతో అనుచిత ప్రవర్తన

– పోలీసులకు అప్పగించిన స్థానికులు



పోలీసుల అదుపులో వంశీనాయక్

మదనపల్లె రూరల్ : మహిళతో అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తిని స్థానికులు పోలీసులకు అప్పగించిన సంఘటన సోమవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. మండలంలోని కోటవారిపల్లెకు చెందిన వంశీనాయక్ (37) స్థానిక చిత్తూరు బస్టాండులో హోటల్‌లో పని చేస్తున్న ఓ మహిళతో సహజీవనం చేసేవాడు. ఇటీవల కొంత కాలంగా వారి మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె అతని నుంచి దూరంగా ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం వంశీనాయక్ సదరు మహిళ పని చేస్తున్న హోటల్ వద్దకు వచ్చి బస్టాండులో ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో స్థానికులు అతనికి దేహశుద్ధి చేసి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో అప్పగించారు.

ఇలాగైతే ఎలాగండి!

- గండి ఆలయ అధికారి ఏకపక్ష ధోరణిపై విమర్శలు
- జర్మన్ షెడ్డు వేసేందుకు టీటీడీ నిరాకరణ
- పారిశుద్ధ్య సిబ్బందిని పంపేందుకూ అంగీకరించని వైనం
- రూ.15 లక్షలు ఆలయ ఆదాయానికి గండి

చక్రాయపేట : శ్రావణ మాస ఉత్సవాల సందర్భంగా గండి ఆలయ ప్రాంగణంలో ప్రతి యేటా వేసే జర్మన్ షెడ్డు ఈసారి సమస్యగా మారింది. దీనికి తోడు పారిశుధ్య కార్మికుల సమస్య కూడా ఉత్సవాల్లో తలెత్తడంతో ఇబ్బందికర పరిస్థితులు నెల కొంటున్నాయి. ఇందుకు ఆలయ సహాయ కమిషనర్ ఒంటెద్దు పోకడే కారణమని పాలక మండలి, కూటమి నేతలు, పలువురు భక్తులు విమర్శిస్తున్నారు.

అధికారి అన్నీ తానే అని భావించడంతోనే..

ఉత్సవాల సందర్భంగా ఆలయ పాలక మండలి, సిబ్బంది కలిసి అధికార పార్టీకి చెందిన నేతల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి వారి ద్వారా టీటీడీ వారిని కలిసి జర్మన్ షెడ్డు, పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయించుకొనేవారు. కాని ఈ దఫా మాత్రం ఆలయ అధికారితో పాటు కాబోయే చైర్మన్ అని ప్రచారం చేసుకునే వ్యక్తి, ప్రధాన అర్చకుడు మాత్రమే నేరుగా టీటీడి అధికారులను కలసి జర్మన్ షెడ్డు, పారిశుధ్య కార్మికులు కావాలని వినతి పత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన టీటీడీ ఈఓ ఆలయం దేవదాయ శాఖ పరిధిలో ఉంది. టీటీడీ ఎందుకు ఇవ్వాలి. దేవదాయ శాఖ తరపునే వాటిని సమకూర్చుకోవాలని లేఖ ద్వారా తెలియజేశారు. గతంలో శ్రావణ మాస ఉత్సవాలు అనగానే కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి ముందుగానే ఇక్కడి అధికారులను అప్రమత్తం చేసి తానూ ప్రత్యేక చొరవ చూపేవారు. దీంతో టీటీడీ వారు మారు మాట్లాడక నేరుగా వచ్చి జర్మన్ షెడ్డు వేసి పారిశుధ్య కార్మికులను ఇక్కడ వదిలి వెళ్లేవారు. నేడు అధికారి నేతల సహకారం తీసుకోనందునే ఇబ్బంది పడాల్సి వస్తోందని పలువురు భక్తులు ఆలయ అధికారి తీరును తప్పు పడుతున్నారు.

దిక్కుతోచక నేతల వద్దకు..

టీటీడీ అధికారులు జర్మన్ షెడ్డు, పారిశుధ్య కార్మికులను పంపడం లేదని చెప్పడంతో దిక్కుతోచక ఆలయ అధికారి కాబోయే చైర్మన్ సహకారంతో పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవిని కలిసి తమ ఇబ్బందిని వివరించారు. కానీ టీడీపీకి చెందిన స్థానిక ఎమ్మెల్సీ రామ గోపాల్‌రెడ్డిని కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్ల లేదని ఆయన అనుచరులు ఆలయ సహాయ కమిషనర్‌పై మండి పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతిసారీ వైఎస్ అవినాష్ రెడ్డి చొరవతో జర్మన్ షెడ్డు, పారిశుధ్య కార్మికులు వస్తే నిరుడు జరిగిన శ్రావణ మాస ఉత్సవాల సమయంలో ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి చొరవ చూపడంతో వాటిని వేశారని కొందరు నేతలు పేర్కొంటున్నారు. ఈసారి ఎమ్మెల్సీని ఆలయ అధికారి ఖాతరు చేయక పోవడం వెనుక కారణం ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు.

జర్మన్ షెడ్ ఎందుకంటే..

ఉత్సవాల సందర్భంగా గండిలో ప్రతి యేటా టీటీడీ వారు వేసే విశాలమైన జర్మన్‌షెడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. వర్షం వస్తే అందులో సుమారు 2వేల మంది వరకు తలదాచుకొనేవారు. పైగా భక్తుల కాలక్షేపం నిమిత్తం సాంస్కృతిక కార్యక్రమాలు కూడా అందులోనే నిర్వహించేవారు.

పారిశుధ్య కార్మికులు లేకుంటే..

టీటీడీ తరఫున వచ్చే పారిశుధ్య కార్మికులు నెల రోజుల పాటు ఉచితంగా ఆలయ ప్రాంగణంతో పాటు పాపాఘ్ని నదిని పరిశుభ్రంగా ఉంచే వారు. జర్మన్ షెడ్డుతో పాటు పారిశుధ్య కార్మికుల ఖర్చు టీటీడీ వారు భరించడంతో ఆలయ ఆదాయానికి గండి పడేది కాదు. నేడు టీటీడీ వారు మొండి చేయి చూపడంతో జర్మన్ షెడ్డుతో పాటు పారిశుధ్య కార్మికుల ఖర్చును ఆలయం నుంచి భరించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రూ.15 లక్షల పైగా ఆలయ నిధులే ఖర్చు చేయక తప్పదు.



గండి వీరాంజనేయ స్వామి మూల విరాట్

మా దృష్టికి రాలేదు..

జర్మన్ షెడ్డు, పారిశుధ్య కార్మికుల విషయం తన దృష్టికి కానీ, పాలక మండలి సభ్యుల దృష్టికి కానీ రాలేదు. సహాయ కమిషనర్ ఏమి చేస్తున్నాడో తెలియలేదు. చివరకు తానే జర్మన్ షెడ్, పారిశుధ్య కార్మికుల పరిస్థితి ఏంటని అడిగితే టీటీడీ వారు నిరాకరించారని వారు పంపిన లేఖను తనకు వాట్సాప్‌లో పంపారు. ఆయన ఒంటెద్దు పోకడల వల్లే ఇబ్బందులు ఎదురవుతున్నాయి.. అని ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ పేర్కొన్నారు.

ఆలయ అధికారి ఏమంటున్నారంటే..

టీటీడీ వారు జర్మన్ షెడ్డు, పారిశుధ్య కార్మికులను తాము ఇవ్వలేమని లేఖ పెట్టారు. వెంటనే బీటెక్ రవిని కలిసి పరిస్థితి వివరించాను. ఎమ్మెల్సీ రామ గోపాల్‌రెడ్డిని కూడా కలుస్తాము. ఆలయంలో చలువ పందిళ్లు టెండర్లు దక్కించుకున్న వారికైనా చెప్పి ఆలయ ఖర్చుతోనే షెడ్డు వేయించాలి. లేకుంటే ఇబ్బంది అవుతుంది. ఈ విషయాన్ని దేవదాయశాఖ మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లాను.. అని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య వివరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయాలు



గాయపడిన షేక్ అబ్దుల్ మునాఫ్

కలకడ : గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మసీదులో మౌజన్‌గా పనిచేస్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం రాత్రి చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై జరిగింది. క్షతగాత్రుని కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలకడ టౌన్ దిగువవీధికి చెందిన రంభూభాయ్‌గారి. షేక్.అబ్దుల్‌మునాఫ్ (80) కలకడ జామియా మసీదులో మౌజన్‌గా ఉన్నారు. ఆదివారం రాత్రి 8 గంటలకు నమాజ్ ముగించుకుని కలకడ సత్యవతినదిపై ఇంటికి నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని తలకు, శరీరంపై తీవ్ర రక్తగాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుని కుమారుడు రంభూభాయ్‌గారి షేక్. ఇనాయతుల్లా కలకడ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన భాగ్యవతి

మదనపల్లెరూరల్ : రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడిన సంఘటన చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలంలో జరిగింది. మదనపల్లె మండలం, బసినికొండకు చెందిన రాము తన భార్య భాగ్యవతితో కలిసి సొంత పనులపై కారులో పెద్దపంజాణి మండలం, చిన్నారికుంటకు వెళ్లారు. సోమవారం తిరిగి మదనపల్లెకు వస్తుండగా మార్గమధ్యంలోని పెద్దారికుంట వద్ద ఎదురుగా వచ్చిన బొలేరో వాహనం కారును ఢీ కొంది. ప్రమాదంలో భాగ్యవతి తీవ్రంగా గాయపడగా, రాముకు స్వల్పంగా గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పెద్దపంజాణి పోలీసులు కేసు విచారణ చేపడుతున్నారు.

మీ అబ్బాయి డిజిటల్ అరెస్ట్ అయ్యాడు

- వాట్సాప్ కాల్‌తో మోసగించే యత్నం
- పోలీసులను ఆశ్రయించిన ఉద్యోగి

మదనపల్లె : మీ కుమారుడు డిజిటల్ అరెస్ట్‌కు గురయ్యాడు.. మాకస్టడిలో ఉన్నాడంటూ ఓ వ్యక్తి సోమవారం ఓ ఉద్యోగికి వాట్సాప్ కాల్ చేసి మోసం చేసే ప్రయత్నం చేశాడు. సంబంధిత ఉద్యోగి వెంటనే పోలీసులను ఆశ్రయించి వివరాలను వారి దృష్టికి తెచ్చారు. వివరాలు ఇవి. స్థానిక ఆడిట్ విభాగంలో డీఏఓగా శ్రీరాములు పని చేస్తున్నారు. ఆయన ఫోన్ నంబర్‌కు ఓ వ్యక్తి వాట్సాప్ కాల్ చేసి హిందీలో మాట్లాడుతూ మీరు శ్రీరాములు కదా..మీ అబ్బాయి హరీష్ కదా అని ప్రశ్నించాడు. దీనికి అవునని సమాధానం చెప్పడంతో మీ అబ్బాయి డిజిటల్ అరెస్ట్‌లో ఇరుక్కున్నాడని చెప్పడంతో ఆందోళనకు గురైన శ్రీరాములు ఎందుకిలా జరిగింది అని ప్రశ్నించగా వీడియోలను వైరల్ చేసిన కేసులో అరెస్ట్ చేసినట్టు తెలిపారు. అయితే మా బిడ్డను ఫోన్‌లో మాట్లాడించండి అని కోరడంతో పొంతన లేని సమాధానాలు చెబుతూ డైవర్ట్ చేసే ప్రయత్నం చేయగా తర్వాత ఫోన్ కాల్ కట్ చేశారు. తర్వాత బెంగళూరులో పని చేస్తున్న హరీష్‌కు ఫోన్ చేయగా తాను ఊటీలో ఉన్నానని, ఫోన్ కాల్ మోసమని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం మదనపల్లె వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని డిజిటల్ అరెస్ట్ పేరుతో వచ్చిన ఫోన్‌కాల్ వివరాలను తెలియజేశారు.

ఆటోను ఢీకొన్న ప్రైవేటు కాలేజీ బస్సు

ఎనిమిదిమంది విద్యార్థులకు గాయాలు



విద్యార్థులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

కురబలకోట/మదనపల్లె రూరల్ : ఇళ్లకు ఆటోలో వెళుతున్న ముదివేడు మోడల్ స్కూల్ విద్యార్థుల ఆటోను అంగళ్లలోని ప్రైవేటు స్కూల్ బస్సు సోమవారం సాయంత్రం ముదివేడు సమీపంలోని చిగురేవాండ్లపల్లె దగ్గర ఢీకొంది. ఈ సంఘటనలో ఆటోలో వెళుతున్న మోడల్ స్కూల్ విద్యార్థులు నల్లగుట్లపల్లెకు చెందిన కేశవ (13), అమృత (12), మంజుల (12), ఆర్సీ కురవపల్లెకు చెందిన శివమణి (16), ఎన్. పల్లవి (15), గడ్డెత్తుపల్లెకు చెందిన యశ్వంత్ (11), లహరి (13), హర్షవర్దన్ (14) గాయపడ్డారు. ఆటోలో 11 మంది వెళుతుండగా సంఘటన జరిగింది. హుటాహుటిన వీరిని 108 వాహనంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం తప్పినట్లు డాక్టర్లు తెలిపారు. నల్లగుట్లపల్లె, ఆర్సీ కురవపల్లె, గడ్డెత్తుపల్లె పరిసర ప్రాంతాల్లోని మోడల్ స్కూల్ విద్యార్థులు ఏడు నుండి ఇంటర్ వరకు చదివే విద్యార్థులు ప్రతి రోజు ఆటోలో రాకపోకలు సాగిస్తున్నారు. రోజు లాగే సోమవారం సాయంత్రం ఇంటికి ఆటోలో వెళుతుండగా చిగురేవారిపల్లె వద్ద ఎదురుగా వచ్చిన ప్రైవేటు బస్సు వేగంగా ఆటోను ఢీకొన్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. ఈ ఘటనలో ఎనిమిది మంది గాయపడ్డారు. రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ పరిస్థితిని పర్యవేక్షించారు. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన ప్రైవేట్ కాలేజీ బస్సు, ఆటోలను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. చిగురేవారిపల్లె వద్ద తాగు నీటి బోరు వేస్తుండగా దుమ్ము ఎక్కువగా రావడంతో ఈ సంఘటన జరిగినట్లు స్థానికుల కథనం. డిప్యూటీ డీఈఓ ద్వారకనాథ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ యోజన గాంధీ విద్యార్థులను పరామర్శించారు.

బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం



రామచంద్రారెడ్డి (ఫైల్)

సిద్దవటం : కడప–చెన్నై ప్రధాన రహదారిలోని భాకరాపేట విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా సోమవారం రాత్రి కడప డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సిద్దవటం మండలం చాముండేశ్వరిపేట గ్రామానికి చెందిన నారపురెడ్డి రామచంద్రారెడ్డి(60) బాకరాపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఇంటి నుంచి డ్యూటీకి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కడప డిపోకు చెందిన ఎలక్ట్రికల్ బస్సు తిరుపతి నుంచి కడపకు వేగంగా వెళుతూ రోడ్డు దాటుతున్న రామచంద్రారెడ్డిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీకి సమాచారం ఇచ్చారు. కడప నగర సమీపంలో ఆర్టీసీ బస్సును పెట్రోలింగ్ పోలీసులు అదుపులోకి తీసుకొని సిద్దవటం పోలీసు స్టేషన్‌కు తరలించారు. మృతుడు రామచంద్రారెడ్డికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎస్ఐ మహమ్మద్ రఫీ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి

జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



దివ్యాంగుడి నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఎస్పీ అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ముఖాముఖి అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై సత్వరం స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను తెలుసుకొని సత్వరం న్యాయం చేస్తామన్నారు.

దివ్యాంగుడి దగ్గరకు....

పెద్దమండ్యం మండలం కలిచర్ల గ్రామానికి చెందిన దివ్యాంగుడు సీమలచెరువు గంగాధర్ నడవలేని పరిస్థితిలో తన సమస్యను చెప్పుకునేందుకు జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ అతని వద్దకే వెళ్లి సమస్యను విన్నారు. అతను ఇచ్చిన ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ చట్టపరిధిలో అతని సమస్యను పరిష్కరించాలని ములకలచెరువు సీఐను ఆదేశించారు.

రాజకీయంగా ఎదుర్కోలేకే
అక్రమ కేసులు



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిపై లేని లిక్కర్ కేసును బనాయించి అరెస్టు చేయడానికి నిరసనగా సోమవారం గాంధీ విగ్రహానికి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడుసార్లు పార్లమెంటు సభ్యుడిగా, లోక్‌సభ ప్యానల్ స్పీకర్‌గా, సౌమ్యుడుగా ఉంటూ ప్రజల హృదయాలను గెలిచిన మిథున్ రెడ్డిని అరెస్టు చేయడం దారుణమన్నారు. ఇలాంటి కుట్రపూరిత కేసులు నిలవవన్నారు. ఎల్లో మీడియా డైరెక్షన్‌లో చంద్రబాబు, లోకేష్‌లు కుట్రలు పన్నుతున్నారన్నారు. ప్రభుత్వం శాశ్వతం కాదన్న విషయం గుర్తించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు శివారెడ్డి, తల్లెం భరత్ కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, సీహెచ్ రమేష్, గంగరాజు, హరికృష్ణారెడ్డి, సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.

మనసు నియంత్రణతో విజయం సాధ్యం



మాట్లాడుతున్న స్వామి బోధమయానందాజీ

రాజంపేట : మనసును నియంత్రణలో ఉంచుకున్నప్పుడు విజయం సాధ్యమవుతుందని రామకృష్ణమఠం స్వామి బోధమయానందాజీ మహారాజ్ అన్నారు. సోమవారం అన్నమాచార్య యూనివర్సిటీలో మైండ్ మేనేజ్‌మెంట్ ఫర్ బెట్టర్ ఫ్యూచర్ అనే అంశంపై వ్యక్తిత్వ వికాస సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. జ్ఞానం, నియంత్రణ, ధ్యానం జీవితాన్ని గెలవడానికి మార్గం చూపుతాయన్నారు. వైస్ చాన్సలర్ డాక్టర్ సాయిబాబారెడ్డి మాట్లాడుతూ విలువ ఆధారిత, ఆధ్యాత్మికతతో కూడిన వ్యక్తిత్వ వికాస సదస్సులు విద్యార్థుల జీవితాల్లో కీలకంగా మారుతాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అద్భుతమైన భవిష్యత్తును కలిగి ఉండాలంటే ముందు మనస్సును క్రమబద్ధీకరించుకోవాలన్నారు. సదస్సులో అలుమ్నీ కో–ఆర్డినేటర్, అన్నమాచార్య రేడియో 89.6 స్టేషన్ డైరెక్టర్ డాక్టర్ కాశిగారిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అది పరువు హత్యేనా?

- వీడనున్న బాలిక హత్య మిస్టరీ!
- అన్ని కోణాల్లో దర్యాప్తు
- నేడో రేపో నిందితుల వివరాలు వెల్లడించనున్న పోలీసులు



గండికోటలో హత్య సంఘటనను పరిశీలించేందుకు వచ్చిన డీఐజీ(ఫైల్‌ఫొటో)

జమ్మలమడుగు : గండికోటలో సంచలనం సృష్టించిన బాలిక హత్య కేసు మిస్టరీని ఎట్టకేలకు పోలీసులు ఛేదించినట్లు తెలిసింది. నిందితులను గుర్తించినట్లు సమాచారం. చిన్న చిన్న సాంకేతిక అడ్డంకులు ఉండటంతో నిందితుల వివరాలు వెల్లడించలేకపోతున్నారని తెలుస్తోంది. ఈనెల 15వ తేదీన ప్రొద్దుటూరుకు చెందిన వైష్ణవి అనే 17 ఏళ్ల బాలిక గండికోటలో హత్యకు గురైన విషయం విదితమే. తమ కూతురు కనిపించలేదంటూ బాలిక తల్లిదండ్రులు ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో 14వ తేదీ ఫిర్యాదు చేశారు. గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు గండికోటలోని రంగనాథస్వామి ఆలయం వెనుకవైపు మరుసటి రోజు బాలిక మృతదేహాన్ని గుర్తించారు.

లోకేష్‌ను అనుమానించి...

బాలికను ప్రొద్దుటూరు నుంచి లోకేష్ అనే యువకుడు ఈనెల 14వతేదీ సోమవారం ఉదయం గండికోటకు బైక్‌పైన తీసుకువచ్చాడు. తిరిగి రెండు గంటల తర్వాత బైక్‌పైన ఒక్కడే వెళ్లిపోయాడు. హత్యచేసింది లోకేష్ గానే మొదట పోలీసులు భావించారు. తర్వాత పోలీసులు గండికోట ప్రాంతంలో పూర్తిగా విచారించడంతో పాటు సీసీ కెమెరాలను పరిశీలించారు. లోకేష్ వెళ్లిపోయిన తర్వాత కూడా బాలిక గండికోటలో సంచరించిందనే నిర్ధారణకు వచ్చారు. దీంతో లోకేష్ పాత్ర లేదని పోలీసులు తేల్చారు. ఈ నేపథ్యంలో హత్య కేసు మృతురాలి కుటుంబ సభ్యుల వైపు మళ్లింది.

సురేంద్ర ప్రవేశంతోనే..

బాలికకు సంబంధించిన ప్రేమ వ్యవహారాన్ని పెద్దనాన్న కుమారుడైన సురేంద్రనే డీల్ చేస్తూ వచ్చాడు. అతను లోకేష్‌ను అనేక సార్లు మందలించాడు. అయితే 14వతేదీన బాలిక కాలేజికి రాలేదని యాజమాన్యం తల్లికి ఫోన్ చేయడంతో ఎక్కడికి వెళ్లిందని ఆరా తీశారు. బాలిక స్నేహితులు గండికోటకు వెళుతున్నట్లు తమతో చెప్పిందని సురేంద్రకు తెలపడంతో లోకేష్‌తో వెళ్లిందని నిర్ధారణకు వచ్చారు. వెంటనే సురేంద్ర గండికోటకు వచ్చి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు.

అక్కడ ఏం జరిగింది..

విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు.. సోమవారం బాలిక లోకేష్‌తో గండికోటకు వెళ్లింది. తనకోసం వస్తున్నారనే సమాచారం తెలుసుకున్న లోకేష్ బాలికను అక్కడే వదిలేసి ఉదయం 10:40 నిమిషాలకు గండికోటనుంచి బయటకు వచ్చేశాడు. ఆ తర్వాత సురేంద్ర గండికోటకు వెళ్లాడు. బాలిక కోసం గండికోటలో వెతుకుతున్న అతనికి ఆమె రంగనాథస్వామి ఆలయం సమీపంలో కనిపించింది. తన కోసమే వస్తున్నాడని భావించి ఆమె పరుగులు తీసింది. ఆ సమయంలో ఆమె కాలికి ఉన్న చెప్పులు రెండు చోట్ల పడిపోయాయి. రంగనాథస్వామి ఆలయం వెనుకవైపు బాలికను చిక్కించుకుని తీవ్రంగా కొట్టడంతో కాలేయం దెబ్బతిని మరణించింది. బాలిక హత్యను లోకేష్ వైపు మళ్లించడం కోసం ఆమె శరీరంపై ఉన్న పంజాబీ డ్రస్సును తొలగించినట్లు పోలీసులు భావిస్తున్నారు. మొత్తం మీద బాలిక హత్య కేసులో కుటుంబ సభ్యులపైనే బలంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుమార్తె చనిపోయిందన్న బాధ వారిలో ఏ కోశానా లేదని, పైగా హత్య జరిగిన ప్రదేశాన్ని మొదట వారే గుర్తించి తమకు తెలపడం, సురేంద్ర గండికోటలో పర్యటించిన సమయంలోనే ఈ హత్య జరిగినట్లు తేలడం.. ఈ అన్ని కారణాల రీత్యా కుటుంబ సభ్యుల ప్రమేయం ఇందులో ఉందనే నిర్ధారణకు పోలీసులు వచ్చినట్లు తెలుస్తోంది. పోలీసులు సోమవారం కుటుంబ సభ్యులను జమ్మలమడుగులోని పోలీసు స్టేషన్‌కు విచారణ నిమిత్తం తీసుకువచ్చారు. ఒకటి రెండు రోజుల్లో నిందితుల వివరాలను మీడియాకు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రాజంపేటలో మున్సిపల్ కార్మికుల భిక్షాటన



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

రాజంపేట : తమ సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్మికులు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద భిక్షాటన చేసి నిరసనన తెలిపారు. మున్సిపల్ కార్మికుల నిరసన ఆరవ రోజుకు చేరుకుంది. వారు మాట్లాడుతూ ప్రాణాలు లెక్క చేయకుండా డ్రైనేజీ కాలువలో పనిచేస్తున్నామని, టీడీపీ ప్రభుత్వానికి తమపట్ల మానవత్వం కూడా లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నేత చిట్వేలి రవికుమార్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

టీకాలతో చర్మవ్యాధుల నివారణ



కత్తివారిపల్లెలో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ మాలకొండయ్య

కలకడ : పశువులలో వ్యాప్తి చెందే చర్మవ్యాధుల నివారణకు అందించే ఉచిత టీకాలను పాడిపశువుల రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధకశాఖ ఉపసంచాలకుడు డాక్టర్ మాలకొండయ్య పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గంగాపురం పంచాయతీ కత్తివారిపల్లెలో చర్మవ్యాధి టీకాల శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధి వచ్చిన ఆవులు, దూడలకు ఒంటిమీద బొబ్బలు రావడం, తీవ్ర జ్వరంతో బాధపడుతాయన్నారు. ఆవులలో పాల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని తెలిపారు. ఈ వ్యాధిని టీకాలతో నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకుడు క్రిష్ణయ్య, డాక్టర్ తేజకళ్యాణ్, పూర్ణిమ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.